క్లుప్తంగా

ఘనంగా రామలక్ష్మణమూర్తి జయంతి


తెర్లాంలో రామలక్ష్మణమూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి, విద్యార్థులు

తెర్లాం/బాడంగి: గ్రంథాలయ ఉద్యమ నాయకుడు జయంతి రామలక్ష్మణమూర్తి జయంతి వేడుకలను తెర్లాం,బాడంగి శాఖా గ్రంథాలయాల్లో లైబ్రేరియన్‌లు సీహెచ్.కృష్ణమూర్తి, ఆర్.దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. రామలక్ష్మణమూర్తి చిత్రపటానికి లైబ్రేరియన్‌లు, పాఠకులు, విద్యార్థు లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్‌లు మాట్లాడుతూ గ్రంథాలయాలు సమాజాభివృద్ధికి ఎంతగానో తోడ్పడతాయని, అటు వంటి గ్రంథాలయాల అభివృద్ధికి అహర్నిషలు కృషి చేసిన మహోన్నత వ్యక్తి రామలక్ష్మణమూర్తి అని అన్నారు. బాడంగిలో నిర్వహించిన కార్యక్రమంలో హెచ్‌ఎం రవిబాబు, విశాఖ డెయిరీ కార్యదర్శి తాన్న దాలినాయుడు పాల్గొన్నారు.

విద్యార్థుల సంఖ్య పెంచాలి

తెర్లాం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఉపాధ్యాయులు ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించాలని ఎంఈఓ త్రినాథరావు అన్నారు. మండలంలోని డి.గదబవలస ప్రాథమిక పాఠశాలలో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. రికార్డులను పరిశీలించడంతో పాటు విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని పరీక్షించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులతో మాట్లాడుతూ పాఠశాలలో పిల్లల సంఖ్య పెంచేందుకు గ్రామంలో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించాలని చెప్పారు. ఐదేళ్లు నిండిన పిల్లల ఇళ్లకు వెళ్లి వారిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని, విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను మరింత మెరుగుపరచాలని, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను పర్యవేక్షించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

5న కొబ్బరి చెక్కలకు వేలం

రాజాం సిటీ: స్థానిక బస్టాండ్ ఆవరణలోని నవదుర్గ అమ్మవారి ఆలయంలో ఈనెల 13 నుంచి 2027 జూలై 12వ తేదీ వరకు భక్తులు మొక్కుబడిగా సమర్పించే కొబ్బరి చెక్కలను దక్కించుకునేందుకు ఈ నెల 5న వేలం నిర్వహించనున్నామని ఈఓ పి.శ్యామలరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ ఆవరణలో దేవాదాయ తనిఖీదారు ఆధ్వర్యంలో ఈ వేలం ఉంటుందని పేర్కొన్నారు. పాటలో పాల్గొనదలచిన వారు రూ.20వేలు డిపాజిట్ చేయాలని సూచించారు. పాట దక్కించుకున్నవారికి తప్ప మిగిలిన వారి డిపాజిట్‌ను పాట అనంతరం వాపసు చేయనున్నామని స్పష్టం చేశారు. పాటను దక్కించుకున్న వారు పాటలో సగం మొత్తాన్ని వెంటనే చెల్లించాల్సి ఉంటుందని, మరిన్ని వివరాలకు ఆలయ పనివేళల్లో సంప్రదించాలని సూచించారు.

పశువులకు టీకాలు

రేగిడి: పశువులకు గాలి కుంటు వ్యాధి సోకకుండా టీకాలు వేస్తున్నామని స్థానిక పశువైద్యాధికారి దుర్గాప్రసాద్ అన్నారు. మండలంలోని మజ్జిరాముడుపేట, అప్పాపురం గ్రామాల్లో పశువులకు మంగళవారం టీకాలు వేశారు. వర్షాకాలంలో పశువులు వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని, జాగ్రత్తలు పాటించాలని పాడి రైతులకు సూచించారు.దుక్కి పశువులు గుంటుకుని నడిస్తే వెంటనే సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్‌ను సంప్రదించాలని చెప్పారు. సర్పంచ్ కరణం శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్ల పాచ్‌వర్కులకు రూ.20లక్షలు మంజూరు


మాట్లాడుతున్న డీఈఈ వెంకటరావు

బొబ్బిలి: నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో రహదారుల పాచ్‌వర్కులకు రూ.20.74లక్షలు మంజూరయ్యాయని ఆర్‌అండ్‌బి డీఈ ఎం.ఎస్.ఎస్.ఎస్. వెంకటరావు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బొబ్బిలి మండలానికి రూ.6.95లక్షలు, తెర్లాం మండలానికి రూ.5.62లక్షలు, రామభద్రపురం, బాడంగి మండలాలకు రూ.8.17లక్షలు మంజూరయ్యాయన్నారు. ఈ నిధులతో త్వరలో పాచ్‌వర్కులు,జంగిల్ క్లియరెన్స్, బ్రిక్‌వర్క్స్ చేపడతామని చెప్పారు. అలాగే ఇటీవల పారాది,గొర్లె సీతారాంపురం మధ్య కూలిన కల్వర్టు స్థానంలో తాత్కాలిక మరమ్మతులకు రూ.8.5లక్షలతో ప్రతిపాదించామన్నారు. ఇదే పనికి 8 మీటర్ల కొత్త శ్లాబు కల్వర్టు, డైవర్షన్ రోడ్డుకు రూ.92లక్షలతో ప్రతిపాదనలు చేసినట్టు చెప్పారు. అలాగే పినపెంకి రహదారికి రూ.2.9 కోట్లతో టెండర్లు పూర్తయ్యాయని, త్వరలో అగ్రిమెంటు పూర్తయితే వర్షాలు తగ్గగానే పనులు మొదలు పెడతామని వివరించారు. ఉత్తరావిల్లి నుంచి రామభద్రపురం, గొర్లె సీతారాంపురం, పాత బొబ్బిలి మధ్య రహదారి పనులకు రూ.4.5 కోట్లు మంజూరయ్యాయని, టెండర్లు పిలవాల్సి ఉందన్నారు. ఇవి కాకుండా గొర్లె సీతారాంపురం, పాత బొబ్బిలి రోడ్ల మరమ్మతులకు రూ.5లక్షల చొప్పున అంచనాలు తయారు చేసినట్టు చెప్పారు. ఏఈ ప్రణయ తదితరులున్నారు.


రాజాం పట్టణంలోని మెంతిపేట ఎస్సీ కాలనీలో నివాసాల మధ్య ఉన్న చెత్త కుప్పలు


రాజాం ఏరియా ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న జ్వరపీడితులు

పడకేసిన పారిశుధ్యం..
విజృంభిస్తున్న జ్వరాలు

- గ్రామాల్లో ఎటు చూసినా చెత్తా చెదారమే
- పారిశుధ్య పనులకు నిధులు లేవంటున్న సర్పంచ్‌లు
- ప్రబలుతున్న సీజనల్ వ్యాధులు
- ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్న వైద్యులు

రాజాం: నియోజకవర్గంలోని రాజాం పట్టణంతో పాటు రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాల్లోని అధిక శాతం గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ పడకేసింది. గ్రామాలు చెత్తాచెదారంతో దర్శనమిస్తున్నాయి. వీధి కాలువలు పూడిక, చెత్త పేరుకుపోయి మురుగు నీరు ముందుకు సాగడం లేదు.పారిశుధ్య నిర్వహణ సరిగా లేకపోవడం, వాతావరణంలో మార్పులు, అడపదడపా కురుస్తున్న వర్షాల వల్ల విష జ్వరాలు ప్రబలుతున్నాయి. గ్రామాల్లో వీధుల మధ్యలో ఉన్న చెత్తాచెదారం వర్షాలకు కుళ్లిపోయి దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. క్లోరినేషన్ లేక తాగునీరు కలుషితమవుతోంది. మురుగు కాలువల్లో చెత్త పేరుకుపోవడంతో నీరు ప్రవహించక దోమల ఉత్పత్తి పెరుగుపోతోంది. వాటి నివారణకు చేపట్టాల్సిన ఫాగింగ్ కార్యక్రమాలు ఇటు పట్టణంతో పాటు అటు గ్రామాల్లోనూ అటకెక్కాయి. ఫలితంగా ప్రజారోగ్యం గాడితప్పింది. పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు జ్వరపీడితులతో కిక్కిరిసిపోతున్నాయి.

పంచాయతీల్లో నిధుల లేమి

పట్టణంలోని వార్డులతో పాటు గ్రామాల్లోని పంచాయతీలను నిధుల లేమి వెంటాడుతోంది. పంచాయతీలకు ఇవ్వాల్సిన నిధులను కూటమి ప్రభుత్వం పక్కదోవ పట్టిస్తోంది. వర్షాకాలం ముందు గ్రామాల్లో మురుగుకాలువల్లో చెత్తను తొలగించేందుకు, తాగునీటి వనరుల్లో క్లోరినేషన్ చేయించేందుకు ఆర్థిక సంఘం నిధులను విడుదల చేయాలి. అయితే గత ఏడాది కాలంగా ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులను పంచాయతీలకు ఇవ్వలేదు. గత ప్రభుత్వంపై నిందలు వేయడమే తప్ప ఇంతవరకు కూటమి ప్రభుత్వం పంచాయ తీల్లో పారిశుధ్య పనుల కోసం నిధులు కేటాయించిన పాపాన పోలేదు. పంచాయతీలకు, మున్సిపల్ కార్యాలయానికి బ్లీచింగ్ బస్తాలు రాలేదు. గత ప్రభుత్వంలో పంపిణీ చేసిన బ్లీచింగ్‌ను, అప్పట్లో విడుదలచేసిన ఫాగింగ్ యంత్రాలతోనే అధికారులు కాలక్షేపం చేస్తున్నా రు.సర్పంచ్‌ల పదవీకాలం కూడా మరో ఎనిమిది నెలల్లో ముగియనుండడంతో వారు తమ సొంత సొమ్ముతో పనులు చేసేందుకు ముందుకు రావడం లేదు. పంచాయతీ కార్యదర్శులు సొంతంగా డబ్బులు వెచ్చించి బ్లీచింగ్ కొనుగోలుచేయలేని పరిస్థితి ఉంది. దీంతో శానిటేషన్ కార్యక్రమాలు నిలిచి దోమల ఉత్పత్తి అధికమైంది. విష జ్వరాలు, డయేరియా, మలేరియా వంటి వ్యాధులతో ప్రజలు ఆస్పత్రులకు పరుగులుపెడుతున్నారు.


రాజాం మండలంలోని లక్ష్మీపురంలో అధ్వానంగా ఉన్న ఓ వీధి

అస్తవ్యస్తంగా ఉంది..

మెంతిపేట ఎస్సీ కాలనీ చెత్తాచెదారంతో అస్తవ్యస్తంగా ఉంది. ఇక్కడ పారిశుధ్య నిర్వహణ లోపించింది. శానిటేషన్, క్లోరినేషన్ పనులు జరగ డంలేదు. మురుగు కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోయింది. తాగునీటి కుళాయిల ద్వారా కలుషితనీరు సరఫరా అవుతోంది. ప్రజలు వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంది.

– కె.రామారావు, మెంతిపేట, రాజాం పట్టణం

ఫాగింగ్ నిలిచిపోయింది

గతంలో వర్షాకాలం రాకముందే వార్డుల్లో శానిటేషన్, క్లోరినేషన్, ఫాగింగ్ కార్యక్రమాలు చేసే వారు. ప్రస్తుతం ఆ కార్యక్రమాలు జరగడం లేదు. దోమలు విజృంభిస్తున్నాయి. తాగునీటి వనరుల్లో క్లోరినేషన్, దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టాలి.

– ఎం. వెంకటేష్, గాయత్రీకాలనీ, రాజాం పట్టణం

నిధులు విడుదల కాలేదు..

పంచాయతీల్లో పారిశుధ్య నిర్వహణకు నిధుల లేమి వెంటాడుతోంది. గతేడాది కాలంగా ఎటువంటి నిధులు విడుదల కాలేదు. ఫాగింగ్ మెషిన్లు, బ్లీచింగ్ పౌడర్లు పంపిణీ కాలేదు. కొనుగోలు చేసేందుకు పంచాయతీలో నిధులు లేవు. నిధులు వస్తే ఏమైనా చేసేందుకు అవకాశం ఉంటుంది.

– రెడ్డి స్వామినాయుడు, సర్పంచ్, మోదుగులపేట, సంతకవిటి మండలం.

జాగ్రత్తలు పాటించాలి

వర్షాకాలం కావడంతో రాజాం పట్టణంతో పాటు గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. ప్రజలు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి. అధికారులు, ప్రజా ప్రతినిధులు పారిశుధ్య నిర్వహణపై దృష్టి పెట్టాలి.

– కె. హరిబాబు, రాజాం ఏరియా ఆస్పత్రి సూపరింటిండెంట్

పరామర్శ


గౌరినాయుడు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న డాక్టర్ తలే రాజేష్, తదితరులు

రాజాం: మండలంలోని కొఠారిపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మొయిలీ గౌరినాయుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు.ఈ విషయం తెలుసుకున్న రాజాం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ మంగళవారం కొఠారిపురంలో మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. పరామర్శించిన వారిలో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ సభ్యులు బండి నర్సింహులు, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు వాకముల్ల చిన్నంనాయుడు, మండల వ్యవసాయ సలహా మండలి మాజీ అధ్యక్షుడు కోనారి అప్పారావు, వైఎస్సార్‌సీపీ కల్చరల్ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ బి.నరేంద్ర, సర్పంచ్ నక్క శ్రీనివాసరావు, స్థానిక నాయకులు చిట్టి పాపినాయుడు, మెయిలి నర్సింహులు, హరి, నర్సింగరావు, నాయుడు తదితరులు ఉన్నారు.

సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక పూజలు


పూజలందుకుంటున్న సుబ్రహ్మణ్య స్వామి

బొబ్బిలి: ఆషాడ షష్ఠి పర్వదినం నేపథ్యంలో స్థానిక బైపాస్ రోడ్డులో ఉన్న దాడితల్లి అమ్మవారి ఆలయంలోని సుబ్రహ్మణ్యస్వామి ఉపాలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురోహితులు పిండిప్రోలు మణికుమార్ శర్మ భక్తులతో స్వామి వారికి అభిషేకాలు, విశేష పూజలు చేయించారు.

కూలిన పెంకుటిల్లు


కూలిన పెంకుటిల్లు ఇదే

రాజాం: పట్టణంలోని హరిజన వీధిలో నివాసముంటున్న వీఆర్‌ఏ పెయ్యిల దాలయ్యకు చెందిన పెంకుటిల్లు పైకప్పు ఆకస్మికంగా కూలింది. గడిచిన నాలుగురోజులుగా కురుస్తున్న వర్షాలకు పైకప్పు పూర్తిగా తడిచిపోవడంతో పెంకుల ద్వారా నీరు కిందికి వచ్చి కలప పాడవడంతో పైకప్పు మంగళవారం ఉదయం కూలిపోయింది. ఆ సమయంలో దాలయ్య ఇంట్లోనే ఉన్నాడు, చుట్టు పక్కల స్థానికులు గుర్తించి, పెంకుల మధ్య ఉండిపోయిన దాలయ్యను బయటకు తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో దాలయ్యకు చిన్నపాటి గాయాలు మాత్రమే కావడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. ఆర్‌ఎంపీ వైద్యుడి ద్వారా వైద్యసాయం అందించారు. ఆ సమయంలో దాలయ్య భార్యతో పాటు కుమారుడు ఇంటి బయట ఉండడంతో వారికి ఎటువంటి ఇబ్బంది కలగలేదు. ఇదిలా ఉండగా వీఆర్‌ఏ ఉద్యోగం చేస్తూ వస్తున్న చాలీచాలని జీతంతో కుటుంబం నెట్టుకొస్తున్న తనకు ఈ పెంకుటిల్లే ఆధారంగా ఉందని దాలయ్యతో పాటు కుటుంబం వాపోయింది. తమకు నిలువనీడలేకుండా పోయిందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు.

బెదిరింపులు ఆపి సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న కార్మిక సంఘ నాయకులు

రాజాం సిటీ: నిరవధిక సమ్మెలో ఉన్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులను రాష్ట్రప్రభుత్వం బెదిరించడం, నిర్బంధించడం ఆపి సమస్య లు పరిష్కరించాలని కార్మికుల యూనియన్ గౌరవాధ్యక్షుడు సీహెచ్.రామ్మూర్తి నాయుడు డిమాండ్ చేశారు. కార్మికుల నిరసన శిబిరం వద్ద మంగళవారం ఆయన మాట్లాడుతూ సమ్మె విర మించి విధుల్లోకి చేరకుంటే నోటీసులు ఇచ్చి ఉద్యోగాల నుంచి తొలగిస్తామని మున్సిపల్ కమిషనర్ అనడం దుర్మార్గమైన చర్య అని అన్నా రు. రాష్ట్ర ప్రభుత్వం ఈరకమైన నియంతృత్వ ధోరణితో వ్యవహరించడం సరి కాదని విమర్శించారు. ఓవైపు రాష్ట్ర ప్రభుత్వం యూనియన్ నాయకులను చర్చలకు పిలిచి కింది స్థాయిలో కమిషనర్లతో బెదిరింపు లకు పాల్పడడం ఏరకమై న న్యాయమని ప్రశ్నించారు. సమస్యలను పరిష్కరించకుండా కార్మికులను వెనక్కు పంపించాలనే ప్రయత్నా లను మానుకోవాలని అన్నారు. ప్రభుత్వం మొండి వైఖరితో వ్యవహరిస్తే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు హరిబాబు, అనిల్, గణపతి, శారద, ప్రసన్న, లక్ష్మి, మరియదాసు, భాస్కరరావు, భుజంగరావు, రాజు, రామకృష్ణ, నర్సింగరావు, శారద తదితరులు పాల్గొన్నారు.

గోరక్షక్ వీర్ పురస్కార గ్రహీతకు సన్మానం


ఎస్‌టీఓను సత్కరిస్తున్న గ్రీన్‌బెల్ట్ సొసైటీ ప్రతినిధులు

బొబ్బిలి: రాష్ట్రీయ గోరక్షక్ వీర్ పురస్కారం అందుకున్న స్థానిక ఎస్‌టీఓ పి.వి.పద్మనాభంను గ్రీన్‌బెల్ట్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవా రం ఘనంగా సత్కరించారు. స్థానిక ఎస్‌టీఓ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రీన్‌బెల్ట్ సొసైటీ అధ్యక్షుడు ఎస్.వి. రమణమూర్తి మాట్లాడుతూ పద్మనాభం సుమారు 500కు పైగా గోవులను కబేళాల నుంచి సంరక్షించడంతో పాటు కొన్ని కబేళాలను మూయించేందుకు చేసిన కృషి అభి నందనీయమన్నారు. ప్రస్తుతం రెండు గోశాలలను నిర్వహించడం గొప్పవిషయమని కొనియాడా రు. సన్మాన గ్రహీత ఎస్‌టీఓ పద్మనాభం మాట్లాడుతూ అందరి సహాయ సహకారాలతో బొబ్బిలిలో గోసంరక్షణ కేంద్రం ఏర్పాటు చేస్తానని చెప్పారు. వనమిత్ర అధ్యక్షుడు కె.కృష్ణదాసు, ఆరికతోట జెడ్పీ హైస్కూల్ పీడీ బి.రత్న కిశోర్,ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధి చెలికాని కేశవ,ఏ.లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

బొబ్బిలి: పట్టణంలోని సంఘం వీధి,సాయినగర్,పూల్‌భాగ్ ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్‌బాబు మంగళవారం శంకుస్థాపన చేశారు. ప్రజలకు ఇబ్బందిగా ఉన్న ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణం జోరుగా నాణ్యతతో నిర్మించాలని సంబంధిత యంత్రాంగానికి ఆదేశించారు. కమిషనర్ ఎల్.రామలక్ష్మి, డీఈ కిరణ్‌కుమార్,ఏఈలు గుప్త, కోటేశ్వరరావు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబు నైజం బయటపడింది


మాట్లాడుతున్న మువ్వల శ్రీనివాసరావు

బొబ్బిలి: తాము అధికారంలోకి వస్తే నాణ్యమైన మందు విక్రయిస్తామని, మద్యం విక్రయాలను నియంత్రిస్తామని చెప్పి గద్దెనెక్కిన చంద్రబాబునాయుడు ఇప్పుడు మాటలు మార్చి తన అసలు నైజం బయట పెడుతున్నారని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, జిల్లా అధికార ప్రతినిధి మువ్వల శ్రీనివాసరావు ఆరోపించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వం చెడ్డ మద్యం విక్రయిస్తోందని, కూటమిని గెలిపిస్తే తక్కువ ధరకు నాణ్యమైన మందు విక్రయిస్తామని చంద్రబాబు హామీఇచ్చారని గుర్తు చేశారు. మద్యం ధరలను ఈ ప్రభుత్వం తగ్గించకపోగా ప్రజలను దోచుకుంటోందని మండిపడ్డారు. ప్రజల ప్రాణాల కంటే ఖజానా నింపుకోవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యంలా ఉందని అన్నారు. లిక్కర్ షాపుల లైసెన్సుల ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి రెండేళ్లకు రూ.1900 కోట్ల ఆదాయంతో పాటు విక్రయం ద్వారా ఏటా రూ.28వేల కోట్లు వస్తున్నాయన్నారు. ఇప్పుడు లైసెన్సులుండవు కనుక ఆ ఆదాయాన్ని పర్మిట్ రూమ్‌ల ద్వారా పిండుకోవాలని బాబు అండ్‌కో చూస్తున్నారన్నారు. ఈపర్మిట్లను కూడా విభజించి ప్రభుత్వం ధరలు పెంచే ప్రయత్నం చేస్తోందన్నారు. ఇటువంటి దుర్మార్గమైన ఆలోచనను కూటమి ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. లేకుంటే ప్రజాగ్రహం ఎదుర్కొంటారని హెచ్చరించారు.

జిల్లా విస్తృతస్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మణరావు,జెడ్పీటీసీ సరస్వతి

రామభద్రపురం: జిల్లా కేంద్రం విజయనగరంలో ఈనెల 3వ తేదీన నిర్వహించనున్న వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశానికి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని ఆపార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు,ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి పిలుపునిచ్చారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్నదాతలను ఆదుకోవడం, వారి సంక్షేమంలో కూటమి ప్రభుత్వం విఫలమైంద న్నారు. పలుమార్లు మంత్రివర్గ సమావేశాలు ఏర్పాటు చేస్తున్నా..కనీసం అన్నదాత గురించి ఆలోచించడం లేదని ఆరోపించారు.గత ప్రభుత్వం అమలు చేసిన రైతు భరోసా, ఉచిత పంటల బీమా, తదితర పథకాలు ఎత్తేయడంతో రైతులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం అందడం లేదన్నారు.అన్నదాత సుఖీభవ పథకం ఆచూకీ లేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో అన్నదాతలు, అన్నిరంగాల వారు నష్టపోతున్నారని అన్నారు. ప్రజాసమస్యలపై చర్చించేందుకు పార్టీ జిల్లా ఇన్‌చార్జి కురసాల కన్న బాబు,శాసన మండలిలో ప్రతిపక్షనాయకుడు బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించనున్న విస్తృతస్థాయి సమావేశానికి అంతా హాజరు కావాలని కోరారు. వైస్ ఎంపీపీ బెల్లాన ప్రసాదరావు,మండల జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్స్ రద్దు చేయాలి



నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు, ఆశ వర్కర్లు, తదితరులు

సంతకవిటి: కార్మికులకు నష్టం కలిగించేలా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రదాన కార్యదర్శి కె.సురేష్‌కుమార్ డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న కార్మిక వ్యతిరేక విధానాలపై మండల కేంద్రంలో మంగళవారం నిరసన తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు నష్టం చేసే విధంగా నాలుగు లేబర్ కోడ్స్ తీసుకురావడాన్ని ఖండించారు. స్కీం వర్కర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం అమలు చేయాలని, భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. వీఆర్ఏలు, గ్రీన్ అంబాసిడర్లు మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 9న చేపట్టనున్న దేశ వ్యాప్త సమ్మెను కార్మికులంతా విజయవంతం చేయాలని కోరారు. సీఐటీయూ మండల కన్వీనర్ కె.అసిరప్పడు, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలకు నిధులు జమచేసేదెప్పుడు..?


వాకముల్ల చిన్నంనాయుడు

రాజాం: గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులు ఎప్పుడు జమచేస్తుందో చెప్పాలని వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌ల విభాగం రాజాం జోనల్ కన్వీనర్ వాకముల్ల చిన్నంనాయుడు డిమాండ్ చేశారు. రాజాంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అభివృద్ధికి పెద్ద పీట వేస్తున్నామని, నిధులు కేటాయిస్తున్నామని పంచాయతీరాజ్, గ్రామీణాభి వృద్ధి శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేసిన ప్రకటనలు అమలుచేసి చూపించాలని కోరారు. 2024 డిసెంబర్‌లో డిప్యూటీ సీఎం పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1150 కోట్లు విడుదల చేసినట్లు ప్రకటించారని, ఆ నిధులు ఇంతవరకూ గ్రామ పంచాయతీలకు జమకాలేదని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీల్లో నిధులు లేకుంటే అభివృద్ధి ఎలా సాధ్యమని, పంచాయతీల అభివృద్ధి కుంటుపడితే డిప్యూటీ సీఎంకే చెడ్డపేరు వస్తుందని పేర్కొన్నారు. ఈనిధులు వెంటనే విడుదలచేసి, గ్రామ పంచాయతీల అభివృద్ధికి సహకరించాలని కోరారు. గత ప్రభుత్వం సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యుల కుటుంబాలకు కూడా అమ్మ ఒడి పథకం అమలుచేసిందని, ఈ ప్రభుత్వం సర్పంచ్‌లకు తల్లికి వందనం నిలుపుదలచేయడం చాలా దారుణమని మండిపడ్డారు.

వైద్యులు.. ప్రాణదాతలు

- ఘనంగా జాతీయ వైద్యుల దినోత్సవం


బొబ్బిలి: వైద్యులను సత్కరిస్తున్న రోటరీ క్లబ్ కార్యవర్గం


తెర్లాం: పెరుమాళి పీహెచ్‌సీలో కేక్ కట్ చేస్తున్న వైద్యులు

బొబ్బిలి: వైద్యులు ప్రాణదాతలని పలువురు వక్తలు అన్నారు. జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పట్టణంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. వివిధ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న వైద్యులకు సిబ్బంది, స్థానికులు శుభాకాంక్షలు తెలిపారు.రోటరీ క్లబ్ జిల్లా చైర్మన్ జె.సి.రాజు, బొబ్బిలి క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సింద్రీ శ్రీనివాసన్, ప్రవీణ్‌కుమార్ పట్టణంలో పని చేస్తున్న ఐఎంఏ బొబ్బిలి అధ్యక్షుడు డాక్టర్ గుల్ల రామ్ నరేష్,స్థానిక సీహెచ్‌సీలో పనిచేస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ జి.శశిభూషణరావు, పోస్ట్‌మార్టం విభాగపు వైద్యులు సంతోషి, కంటి ఆస్పత్రి వైద్యులు కె.వి.అప్పారావుతో పాటు పలువురు వైద్యులను సత్కరించారు. రోటరీ క్లబ్ కమ్యూనిటీ చైర్ ఎస్.అప్పలరాజు, సెక్రటరీ చైర్ శివకాంత్, కార్యనిర్వాహక కార్యదర్శి కె.రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పెరుమాళి పీహెచ్‌సీలో..

తెర్లాం: మండలంలోని పెరుమాళి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ)లో జాతీయ వైద్యుల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. సామాజిక ఆరోగ్య అధికారి డి.పద్మావతి, వైద్యాధికారులు ఎస్.వెంకటేశ్, మనోజ్ఞ రమణి, ఆయుష్ వైద్యాధికారి ఎస్.శ్రీనివాసరావు కేక్ కట్ చేశారు. పీహెచ్‌సీ ఆప్తాలమిక్ అధికారి వసంతరావు, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భూములను కార్పొరేట్లకు అప్పగించే కుట్ర


మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకరరావు, తదితరులు

బొబ్బిలి: కోట్ల ఎకరాలను అదానీ, అంబానీ వంటి కార్పొరేట్లకు అప్పగించేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రపన్నుతోందని, అందులో భాగంగానే ప్రధాని నరేంద్ర మోదీ రైతు చట్టాలను తీసుకువస్తున్నారని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పొట్నూరు శంకరరావు ఆరోపించారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం కార్మిక సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్, ప్రభుత్వ రంగ సంస్థలు,బ్యాంకులు, ఇన్సూరెన్స్, ఎయిర్‌లైన్స్,పోర్టులు, అడవుల వంటి దేశ సంపదను కార్పొరేట్లకు అప్పగించాలని చూస్తోందన్నారు. పీకేఎస్ జిల్లా అధ్యక్షుడు టి.అప్పలనాయుడు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని ఎత్తేయడానికి ప్రధాని మోదీ తీవ్రంగా శ్రమిస్తున్నారన్నారు. ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు ఎం.గోపాలం మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం ఆడమన్నట్టు రాష్ట్రంలోని చంద్రబాబు ప్రభుత్వం ఆడుతోందన్నారు. పనివేళలను 8 నుంచి 10 గంటలకు పెంచేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించిందన్నారు. ఈ దారుణాలు, మోసాలను అణచివేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 9న జరిగే సార్వత్రిక సమ్మె చేపట్టనున్నట్టు చెప్పారు. ఆరోజు ఉదయం బొబ్బిలిలోని వేణు గోపాలస్వామి ఆలయం నుంచి భారీ ప్రదర్శన ర్యాలీ ప్రారంభమవుతుందని, ఈ ప్రదర్శనలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక,కర్షక, యువత, నిరుద్యోగులంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ సెక్రటరీ మునకాల శ్రీనివాసరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.గోపాలం, తదితరులు పాల్గొన్నారు.